# కుస్తీమే సవాల్..

### హోరాహోరీగా జాతీయస్థాయి పోటీలు

### తెలంగాణ కుస్తీవీరునికి రెండో స్థానం



అయిజ, మార్చి 4: జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీ కేంద్రంలో తిక్క వీరేశ్వరస్వామి బ్రహోత్మవాలను పురస్కరించుకుని జాతీయస్థాయి కుస్తీ పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ టోర్నీలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, హర్యానా రాష్ట్రాలకు చెందిన 35 మంది మల్లయోధులు పోటీపడ్డారు. ఫైనల్లో కర్ణాటకకు చెందిన రాంచందర్, హైదరాబాద్(తెలంగాణ)కు చెందిన రుద్రేశ్ యాదవ్ ముఖాముఖి తలడ్డారు. హోరాహోరీగా సాగిన తుది పోరులో రాంచందర్ విజేతగా నిలువగా, రుద్రేశ్ రన్నరప్‌తో సరిపెట్టుకున్నాడు. వికాస్(హర్యానా), చరణ్, రాంశెట్టి(తెలంగాణ) వరుసగా మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచారు. వీరికి ఎస్సై విజయ్‌భాస్కర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

# ఆటకు వీడ్కోలు

## బ్యాడ్మింటన్ కెరీర్‌కు సాయిప్రణీత్ గుడ్‌బై

**గాయాల కారణంగా నిర్ణయమని ప్రకటన • తనకు మద్దతుగా నిలిచిన వారికి కృతజ్ఞతలు**



న్యూఢిల్లీ: బ్యాడ్మింటన్ క్రీడకు యువ షట్లర్ సాయిప్రణీత్ వీడ్కోలు పలికాడు. గత కొన్నేండ్లుగా గాయాలతో సతమతమవుతున్న సాయిప్రణీత్ కెరీర్‌కు గుడ్‌బై చెబుతున్నట్లు సోమవారం తన ఎక్స్(ట్విటర్) వేదికగా ప్రకటించాడు. గాయాలతో ఫిట్‌నెస్ పరంగా సమస్యలు ఎదుర్కొంటున్న కారణంగా ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ప్రణీత్ పేర్కొన్నాడు. ఈ తన సుదీర్ఘ ప్రయాణంలో తనకు మద్దతుగా నిలిచిన ప్రతీ ఒక్కరికి ప్రణీత్..కృతజ్ఞతలు తెలిపాడు. అమెరికాలో ఒక క్లబ్‌కు సేవలు అందించబోతున్నట్లు తన భవిష్యత్ ప్రణాళికను వివరించాడు. దేశ బ్యాడ్మింటన్‌పై తనదైన ముద్ర వేసిన సాయి ప్రణీత్.. కెరీర్‌కు వీడ్కోలు పలుకడంపై స్పందిస్తూ 'డియర్ బ్యాడ్మింటన్ థాంక్యూ..అన్ని రకాల భావాల మేళవింపుతో ఇది రాసుకొస్తున్నాను. బ్యాడ్మింటన్‌తో 24 ఏండ్లకు పైగా ఉన్న సుదీర్ఘ అనుబంధానికి ముగింపు పలుకుతూ రిటైర్మెంట్ ప్రకటిస్తున్నాను. ఈ రోజు నుంచి కెరీర్‌లో కొత్త చాప్టర్ మొదలుపెడుతున్నాను. నేను ఈ స్థాయికి చేరుకోవడానికి కారణమైన అందరికీ రుణపడి ఉంటాను. అభిమానుల అపూర్వ మద్దతు..నా గొప్ప బలం. ప్రతీసారి మీరు ఇచ్చిన సపోర్ట్..జెండా ఎగిరినప్పుడల్లా నా ఆత్మవిశ్వాసం అంతకంతకూ పెరుగుతూ నమ్మకం బలపడింది. నా కెరీర్‌లో మీరు భాగం కావడం ఆశీస్సులకు ఏ మాత్రం తక్కువ కాదు. బ్యాడ్మింటన్ ఆటపై నాది తొలిప్రేమ, నేను గుర్తింపులోకి వచ్చింది ఆట ద్వారా మాత్రమే. ఈ ప్రయాణంలో ఎన్నో అనుభూతులు, ఎన్నో అడ్డంకులను అధిగమించాను. అవి నా హృదయంలో పదిలంగా ఉంటాయి. ఈ సందర్భంగా నాకు మద్దతు నిలిచిన తల్లిదండ్రులు, గ్రాండ్ పేరెంట్స్, భార్య శ్వేత..మీ మద్దతు నా కెరీర్ ఉన్నతికి ఎంతగానో దోహదపడింది. మీ సహకారం లేకపోతే..ఇది సాధ్యపడకపోయేది. గోపీచంద్ అన్నకు హృదయపూర్వక కృతజ్ఞతలు. అకాడమీకి, కోచింగ్, సహాయ సిబ్బందికి అందరికీ థ్యాంక్స్. కెరీర్ తొలినాళ్లలో తీర్చిదిద్దిన ఆరిఫ్ సార్, గోవర్ధన్ సార్‌కు ధన్యవాదాలు. బాయ్‌కు, సాయ్‌కు, సాట్స్‌కు, బెంగళూరు ర్యాప్టర్స్, హైదరాబాద్ హంటర్స్, అవధే వారియర్స్ అందరికీ కృతజ్ఞతలు. ఇక్కడితో బ్యాడ్మింటన్ కెరీర్‌కు వీడ్కోలు పలుకుతున్నాను. కానీ ఆటతో నా అనుబంధం కొనసాగుతుంది. అది ప్లేయర్‌గా కాకుండా కోచ్‌గా, మెంటార్‌గా ఏదో ఒక రూపంలో ఆట అభివృద్ధిలో భాగమవుతాను' అని రాసుకొచ్చాడు.

### అమెరికా క్లబ్‌తో కలిసి

రెండు దశాబ్దాల కెరీర్ కల్గిన హైదరాబాద్ షట్లర్ సాయిప్రణీత్..తన భవిష్యత్ ప్రణాళికను వెల్లడించాడు. 2017లో సింగపూర్ ఓపెన్ గెలిచిన ఈ 31 ఏండ్ల యువ షట్లర్ 2019 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకంతో చరిత్ర సృష్టించాడు. ఈ క్రమంలో బీడబ్ల్యూఎఫ్ ర్యాంకింగ్స్‌లో టాప్-10 ర్యాంకింగ్స్‌లో నిలువడం ద్వారా ప్రతిష్ఠాత్మక టోక్యో(2020) ఒలింపిక్స్‌కు అర్హత సాధించాడు. అయితే ఆడిన మూడు లీగ్ మ్యాచ్‌ల్లో ఓడటం ద్వారా మెయిన్ డ్రాకు అర్హత సాధించలేకపోయాడు. అప్పటి నుంచి చాలాసార్లు గాయాల పాలు అవుతున్న సాయిప్రణీత్ పూర్తి స్థాయిలో ఆటతీరు ప్రదర్శించడంలో విఫలమవుతూ వచ్చాడు. ఓవైపు యువ షట్లర్లతో పోటీ నెలకొనడం, ఫిట్‌నెస్ సమస్యలు ఇబ్బంది పెట్టడం అతనికి కెరీర్‌కు ప్రతిబంధకంగా మారాయి. ఇదిలా ఉంటే అమెరికాలోని ట్రయాంగిల్ బ్యాడ్మింటన్ అకాడమీలో హెడ్‌కోచ్‌గా ప్రణీత్ బాధ్యతలు నిర్వర్తించబోతున్నాడు. అక్కడ ప్లేయర్ల ఆటతీరును పరిశీలించనున్నాడు. తన పాత్రపై త్వరలో మరిన్ని విషయాలు వెల్లడిస్తానని ఈ సందర్భంగా ప్రణీత్ పేర్కొన్నాడు.



## ఐపీఎల్‌కు కాన్వే దూరం!

వెల్లింగ్టన్: ఐపీఎల్ మొదలుకాకముందే డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్‌కు ఎదురుదెబ్బ తగిలింది. చేతి వేలి గాయం కారణంగా న్యూజిలాండ్ క్రికెటర్ డేవాన్ కాన్వే రానున్న ఐపీఎల్ సీజన్‌కు పూర్తిగా దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆస్ట్రేలియాతో ఇటీవల జరిగిన రెండో టీ20 మ్యాచ్ సందర్భంగా కాన్వే గాయపడ్డాడు. దీంతో సిరీస్‌లోని మిగిలిన మ్యాచ్‌తో పాటు ఆసీస్‌తో తొలి టెస్టుకు దూరమయ్యాడు. పూర్తిగా కోలుకునేందుకు ఎనిమిది వారాల సమయం పట్టే అవకాశముందని న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. కాన్వే ఎడమచేతి బొటన వేలుకు గాయమైంది. ఈ వారంలో అతని వేలికి శస్త్ర చికిత్స జరుగుతుంది. ఎనిమిది వారాల వ్యవధిలో అతను పూర్తిగా కోలుకునే అవకాశముంది' అని న్యూజిలాండ్ చీఫ్ కోచ్ గ్యారీ స్టెడ్ మీడియా ముఖంగా పేర్కొన్నాడు. 2022లో కాన్వేను చెన్నై కనీస ధర కోటి రూపాయలకు తీసుకుంది. ఇప్పటి వరకు చెన్నై తరఫున 23 మ్యాచ్‌లాడిన ఈ లెఫ్ట్ హ్యాండర్ ఓపెనర్ 46 సగటుతో 924 పరుగులు చేశాడు. ఇదిలా ఉంటే కాన్వే గాయంపై చెన్నై ఫ్రాంచైజీ ఇంకా అధికారికంగా స్పందించాల్సి ఉంది.

## సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్‌గా కమిన్స్



ముంబై: సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ ప్యాట్ కమిన్స్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. గత కొన్ని సీజన్లుగా వ్యవహరిస్తున్న ఎయిడెన్ మార్క్‌రమ్‌ను కెప్టెన్సీ నుంచి తప్పిస్తూ సన్‌రైజర్స్ యాజమాన్యం కమిన్స్‌ను నియమించింది. ఈ విషయాన్ని తమ అధికారిక సోషల్‌మీడియా వేదికగా సోమవారం ప్రకటించింది. ఇటీవల జరిగిన ఐపీఎల్ వేలంలో రికార్డు స్థాయిలో కమిన్స్‌ను రూ.20.50 కోట్లకు సన్‌రైజర్స్ దక్కించుకుంది. మిగతా ఫ్రాంచైజీలను వెనుకకు నెడుతూ రేసులో కొనసాగిన హైదరాబాద్ ఎట్టకేలకు కమిన్స్‌ను తమ వశం చేసుకుంది. గత సీజన్లుగా ప్లేఆఫ్స్ చేరలేక లీగ్ దశకే పరిమితమవుతూ వస్తున్న హైదరాబాద్ ఈసారైనా తమ ప్రదర్శన మెరుగుపర్చుకోవాలని చూస్తున్నది. కెప్టెన్‌గా నియామకంపై కమిన్స్ స్పందిస్తూ భారత్ నాకు రెండో ఇళ్లు లాంటిది. ఐపీఎల్ ద్వారా మేము ఇక్కడ చాలా రోజులు గడిపాం. ఇక్కడ ఆయా నగరాలకు చెందిన జట్లకు ప్రాతినిధ్యం వహించడం మరిచిపోలేనిది. ఫ్యాన్స్ ఎప్పుడు కలిసినా తమ అభిమానాన్ని చాటుకుంటారు. మీరు కోల్‌కతా(పాత జట్టు) టీమ్ కదా అంటూ అప్యాయంగా పలకరిస్తుంటారు. రానున్న సీజన్‌లో హైదరాబాద్‌కు ఆడుతుండటం కొత్త అనుభూతిని ఇవ్వబోతున్నది' అని అన్నాడు.



## హైదరాబాద్ పోలో పోటీలు షురూ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: అంతర్జాతీయ పోలో పోటీలకు హైదరాబాద్ మరోసారి వేదికైంది. ఆరు జట్ల సమాహారంతో హైదరాబాద్ పోలో అండ్ రైడింగ్ క్లబ్(హెచ్‌పీఆర్‌సీ)లో టోర్నీ సోమవారం అట్టహాసంగా మొదలైంది. అజీజ్‌నగర్(మొయినాబాద్) వేదికగా ఈ నెల 10వ తేదీ వరకు జరుగనున్న టోర్నీలో ఆతిథ్య భారత్‌తో పాటు అమెరికా తరఫున రెండేసి జట్లు బరిలోకి దిగుతుండగా, స్పెయిన్, లక్సెంబర్గ్ ఒక్కో టీమ్‌ను పోటీకి దింపుతున్నాయి. పోటీలకు తొలి రోజైన సోమవారం భారత్, అమెరికా జట్లు పోటీపడ్డాయి. నాలుగు జట్లు బరిలోకి దిగడం హెచ్‌పీఆర్‌సీ చరిత్రలో ఇది తొలిసారి అని నిర్వాహకులు పేర్కొన్నారు. హెచ్‌పీఆర్‌సీలో పోలో ప్రపంచకప్ నిర్వహించడం తన లక్ష్యమని అధ్యక్షుడు చైతన్యకుమార్ ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు.

## శ్రీనిధి ఎఫ్‌సీకి చుక్కెదురు



హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్ఠాత్మక ఐ-లీగ్‌లో వరుస విజయాలతో దూసుకెళుతున్న శ్రీనిధి దక్కన్ ఫుట్‌బాల్ క్లబ్(ఎస్‌డీఎఫ్‌సీ)కు చుక్కెదురైంది. సొంతగడ్డపై తమకు తిరుగులేదనుకున్న శ్రీనిధికి రియల్ కశ్మీర్ చెక్ పెట్టింది. సోమవారం దక్కన్ ఎరీనాలో జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి 2-3 తేడాతో రియల్ కశ్మీర్ చేతిలో ఓటమిపాలైంది. ఇరు జట్లు హోరాహోరీగా తలపడటంతో ప్రథమార్ధం ఎలాంటి గోల్ నమోదు కాలేదు. అయితే కీలకమైన ద్వితీయార్ధంలో తొలుత శ్రీనిధి ఆధిక్యం ప్రదర్శించగా, రియల్ కశ్మీర్ దీటైన పోటీనిచ్చింది. ఈ క్రమంలో రియల్ కశ్మీర్ తరఫున కిర్జో(45ని, 93ని) రెండు గోల్స్‌తో అదరగొట్టగా, తారిఖ్ మిర్(87ని) మరో గోల్ చేశాడు. మరోవైపు శ్రీనిధికి హసన్(58ని), సబియా(61ని) ఒక్కో గోల్ చేశారు. సాజిద్ ధోత్ రెండు సార్లు నిబంధనలు ఉల్లంఘించడంతో మ్యాచ్ రిఫరీ రెడ్‌కార్డ్‌కు గురయ్యాడు. ఈ కారణంగా శ్రీనిధి పది మంది ప్లేయర్లతోనే మ్యాచ్ ఆడాల్సి వచ్చింది. పాయింట్ల(33) పరంగా రెండు జట్లు సమంగా ఉన్నప్పటికీ ముఖాముఖి పోరులో విజయంతో రియల్ కశ్మీర్ రెండో స్థానంలో కొనసాగుతుండగా, శ్రీనిధి మూడో స్థానంలో ఉంది. మొహమ్మదీన్(38) క్లబ్ అగ్రస్థానంలో కొనసాగుతున్నది.

## రంజీ ఫైనల్లో ముంబై

**సెమీస్‌లో తమిళ నాడుపై ఘన విజయం**



ముంబై: ముంబై మరోసారి జూలు విదిల్చింది. పూర్తి ఏకపక్షంగా సాగిన సెమీఫైనల్లో తమిళనాడుపై ఇన్నింగ్స్ 70 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. దీని ద్వారా రంజీ ట్రోఫీ చరిత్రలో రికార్డు స్థాయిలో 48వ సారి ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఓవర్‌నైట్ స్కోరు 353-9తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ముంబై 378 పరుగులకు ఆలౌటైంది. దీంతో ముంబైకి 232 పరుగుల ఆధిక్యం దక్కింది. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన తమిళనాడు..162 పరుగులకు కుప్పకూలింది. బాబా ఇంద్రజీత్(70) తప్ప మిగతా బ్యాటర్లు ఘోరంగా విఫలమయ్యారు. సెంచరీతో ముంబైకి భారీ స్కోరు అందించిన ఆల్‌రౌండర్ శార్దుల్ ఠాకూర్ రెండు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకమయ్యాడు. శామ్స్ ములానీకి నాలుగు వికెట్లు దక్కగా, మోహిత్ అవస్తి, తనుష్ చెరో రెండు వికెట్లు తీశారు.

**ఆధిక్యంలో విదర్భ:**

మధ్యప్రదేశ్‌తో జరుగుతున్న మరో రంజీ సెమీస్‌లో విదర్భ భారీ ఆధిక్యం దిశగా సాగుతున్నది. ఓవర్‌నైట్ స్కోరు 13-1 మూడో రోజు ఆట కొనసాగించిన విదర్భ చివరికి 343-6 స్కోరు చేసింది. ఆరంభంలోనే వికెట్లు పడ్డా..యష్ రాథోడ్ (97 బ్యాటింగ్), అక్షయ్ వాడ్కర్ (77), అమన్ (59), ధృవ్ షోరె (40) రాణించారు. మధ్యప్రదేశ్ బౌలర్లలో అనుభవ్, కార్తీకేయ రెండేసి వికెట్లు తీశారు.

## మందన సూపర్ | యూపీపై ఆర్‌సీబీ ఘన విజయం



బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) వరుస విజయాల జోరు కొనసాగుతున్నది. సొంత గడ్డపై అభిమానుల అపూర్వ మద్దతు మధ్య బరిలోకి దిగిన ఆర్‌సీబీ సోమవారం జరిగిన మ్యాచ్‌లో 23 పరుగుల తేడాతో అద్భుత విజయం సాధించింది. తొలుత నిర్ణీత 20 ఓవర్లలో ఆర్‌సీబీ 198-3 స్కోరు చేసింది. కెప్టెన్ స్మృతి మందన(50 బంతుల్లో 80, 10ఫోర్లు, 3సిక్స్‌లు) ధనాధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగగా, ఎలీస్ పెర్రీ(58) అర్ధసెంచరీతో ఆకట్టుకుంది. ఓపెనర్ మేఘన(28) నిరాశపర్చగా, మందన, పెర్రీ ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. వీరిద్దరి కలిసి రెండో వికెట్‌కు 95 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. మందన తనదైన శైలిలో దూకుడు ప్రదర్శిస్తూ మైదానం నలువైపులా బౌండరీలతో చెలరేగింది. శర్వాణి, దీప్తిశర్మ, ఎకల్‌స్టోన్ ఒక్కో వికెట్ తీశారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన యూపీ వారియర్స్ 175-8 స్కోరు చేసింది. కెప్టెన్ అలీస్సా హీలీ(55), దీప్తిశర్మ(33) ఫర్వాలేదనిపించారు. సోఫీ డివైన్, మోలినిక్స్, వేర్‌హామ్, శోభన రెండేసి వికెట్లు తీశారు. మందనకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. మంగళవారం నుంచి ఢిల్లీ వేదికగా డబ్ల్యూపీఎల్ మ్యాచ్‌లు మొదలుకాబోతున్నాయి.

# మార్కెట్ల రికార్డుల హోరు




ముంబై, మార్చి 4: దేశీయ స్టాక్ మార్కెట్లు రికార్డుల మీద రికార్డులు బద్దలు కొడుతున్నాయి. తీవ్ర ఒడిదుడుకుల మధ్య ప్రారంభమైన సూచీలకు ఎనర్జీ బ్యాంకింగ్ షేర్ల మద్దతుతోపాటు ఈ ఏడాదికిగాను భారత్ అంచనాలకుమించి రాణించనున్నట్లు మూడీస్ వెల్లడించడంతో మదుపరుల్లో ఉత్సాహాన్ని నింపింది. దీంతో ఇరు సూచీలు ఆకాశమే చారిత్రక గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. ఈ ఏడాది మూడో త్రైమాసికంలో భారత్ 8.4 శాతం వృద్ధిని సాధించిన విషయం తెలిసిందే. దీంతో 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 66.14 పాయింట్లు అందుకొని చారిత్రక గరిష్ఠ స్థాయి 73,872.29 పాయింట్లకు చేరుకున్నది.ఇంట్రాడేలో సూచీ 183.98 పాయింట్లు ఎగబాకి 74 వేల పాయింట్ల దిశలో పయనించింది. మరో సూచీ నిఫ్టీ 27.20 పాయింట్లు అందుకొని ఆల్‌టైం హైకి 22,405.60 పాయింట్లకు చేరుకున్నది. ఇంట్రాడేలోనూ 22,440.90 పాయింట్లు అందుకున్నది. ఐటీ, ఎఫ్ఎంసీజీ, వాహన రంగ షేర్లను విక్రయించిన మదుపరులు..ఇదే సమయంలో బ్యాంకింగ్, ఎనర్జీ, ఫార్మా రంగ షేర్లను ఎగబడి కొనుగోళ్లు జరపడంతో సూచీలు రికార్డు స్థాయికి చేరుకోవడానికి దోహదపడ్డాయి.

- గత నాలుగు రోజుల్లో సెన్సెక్స్ 1,567 పాయింట్లు(2.15 శాతం), నిఫ్టీ 454 పాయింట్లు(2 శాతం) ఎగబాకింది.
- ఎన్‌టీపీసీ 3.50 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. పవర్ గ్రిడ్, రిలయన్స్‌లు ఒక్క శాతానికి పైగా బలపడ్డాయి.
- యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, టెక్ మహీంద్రా, బజాజ్ ఫిన్ సర్వ్, ఇండస్ ఇండ్ బ్యాంక్, ఎయిర్‌టెల్, హెచ్‌యూఎల్, మారుతి , బజాజ్ ఫైనాన్స్, కొటక్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, సన్‌ఫార్మా షేర్లు లాభాల్లో ముగిశాయి.
- కానీ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా స్టీల్, అల్ట్రాటెక్ సిమెంట్, ఇన్ఫోసిస్, టైటాన్, ఐటీసీ, ఏషియన్ పెయింట్స్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్, విప్రో, నెస్లే, ఎల్‌అండ్‌టీ, ఎస్బీఐ, టాటా మోటార్స్ షేర్లు నష్టపోయాయి.
- బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లు మిశ్రమంగా ట్రేడయ్యాయి.
- రంగాలవారీగా చూస్తే ఆయిల్ అండ్ గ్యాస్, ఎనర్జీ, పవర్, యుటిలిటీ, టెలి కమ్యూనికేషన్స్, బ్యాంకింగ్ రంగ సూచీలు లాభాల్లో ముగియగా..కమోడిటీస్, కన్స్యూమర్ డ్యూరబుల్, ఎఫ్ఎంసీజీ, ఐటీ, టెక్నాలజీ షేర్లు నష్టపోయాయి.
- బీఎస్ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ రూ.3.93 లక్షల కోట్లకు చేరుకున్నది.



శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి జాతీయ స్థాయిలో ఎనర్జీ ఎఫిషియెన్సీ అండ్ సస్టయినబిలిటీ అవార్డును అందుకుంటున్న కంపెనీ ప్రతినిధి.



## నయా పల్సర్ ఎన్ఎస్

### గరిష్ఠ ధర రూ.1.57,472

పుణె, మార్చి 4: ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ బజాజ్ ఆటో..అప్‌గ్రేడ్ చేసిన పల్సర్ ఎన్ఎస్ మోడల్‌ను పరిచయం చేసింది. 2024 సిరీస్‌లో భాగంగా విడుదల చేసిన ఎన్200, ఎన్160, ఎన్ఎస్125 మాడళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటిలో ఎన్ఎస్ 200 మాడల్ ధర రూ.1,57,427గాను, ఎన్ఎస్160 ధర రూ.1,45,792, ఎన్ఎస్125 మాడల్ ధరను రూ.1,04,922గా నిర్ణయించింది.



### టాటా మోటార్స్

## విభజన

**వాణిజ్య, పాసింజర్ వాహన వ్యాపారాలు వేరువేరుగా లిస్టింగ్**

న్యూఢిల్లీ, మార్చి 4: టాటా మోటర్స్ కీలక నిర్ణయం తీసుకున్నది. తన బ్రాండ్ విలువను పెంచుకునే ఉద్దేశంలో భాగంగా వాణిజ్య, ప్యాసింజర్ వాహన వ్యాపారాలను వేరువేరుగా లిస్టింగ్ చేయబోతునున్నట్లు సోమవారం ప్రకటించింది. కమర్షియల్ వాహన బిజినెస్‌ను ఒక్క సంస్థగా ఈక్విటీ మార్కెట్లోకి ప్రవేశపెట్టనున్న టాటా మోటార్స్...ప్యాసింజర్ వాహన విభాగం, ఈవీ, జేఎల్ఆర్‌ను ఒక్కతాటిపైకి తెచ్చి మార్కెట్లో లిస్ట్ చేయబోతున్నది. ఈ సందర్భంగా టాటా మోటార్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ..గత కొన్నేండ్లుగా టాటా మోటార్స్ అంచనాలకుమించి రాణిస్తున్నదని, ఆటోమోటివ్ బిజినెస్ యూనిట్లను విడగొట్టి ప్రత్యేక సంస్థలను స్టాక్ మార్కెట్లో లిస్ట్ చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు.

# భారత్ వృద్ధి 6.8 శాతం

**• అంచనాల్ని పెంచిన మూడీస్**



న్యూఢిల్లీ, మార్చి 4: అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ ప్రస్తుత 2024 క్యాలండర్ సంవత్సరానికి భారత్ ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు అంచనాల్ని 6.8 శాతానికి పెంచింది. గతంలో ప్రకటించిన అంచనా 6.1 శాతంగా ఉన్నది. పటిష్ఠమైన ఆర్థిక గణాంకాలు వెలువడుతున్నాయని, జీ-20 దేశాల్లోకెల్లా భారత్ వేగవంతమైన వృద్ధిని సాధిస్తుందని మూడీస్ అనుబంధ సంస్థ మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ పేర్కొంది. 2025 సంవత్సరంలో 6.4 శాతం వృద్ధిని ప్రదర్శించవచ్చని అంచనా వేసింది. 2023 క్యాలండర్ సంవత్సరం నాల్గవ త్రైమాసికంలో జీడీపీ 8.4 శాతం వృద్ధిచెందడంతో పూర్తి క్యాలండర్ సంవత్సరంలో ఇది 7.7 శాతానికి చేరింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 8.2 శాతం, జూలై-సెప్టెంబర్ మూడు నెలల కాలంలో 8.1 శాతం చొప్పున వృద్ధిచెందిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం మౌలిక సదుపాయాలకు ఖర్చుచేయడం, తయారీ రంగం కార్యకలాపాలు మెరుగుకావడంతో 2023లో వృద్ధి జోరందుకుందని మూడీస్ వివరించింది. సెప్టెంబర్-డిసెంబర్‌లో కనపర్చిన వృద్ధివేగం 2024 మార్చి త్రైమాసికంలోకి విస్తరిస్తుందన్న సంకేతాలు కన్పిస్తున్నాయన్నది.

**విధానాలపై ఎన్నికల ఫలితాల ఎఫెక్ట్**

జీఎస్టీ వసూళ్ల జోరు, ఆటో అమ్మకాల వృద్ధి, రెండంకెల్లో బ్యాంక్ రుణాల పెరుగుదల తదితర అంశాలు పట్టణ వినియోగం, డిమాండ్ చెక్కుచెదరలేదని వెల్లడిస్తున్నాయన్నది. మరోవైపు తయారీ, సేవల రంగాల పీఎంఐల (పర్చేజ్ మేనేజర్స్ ఇండెక్స్‌లు) ఆర్థిక వ్యవస్థ పరుగును సూచిస్తున్నాయని మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీసెస్ నివేదిక పేర్కొంది. ఇండియాతో సహా పలు జీ-20 దేశాలకు 2024 ఎన్నికల సంవత్సరమని, ఈ ఏడాది ఎన్నుకోబడిన నేతల ప్రభావం వచ్చే నాలుగైదేండ్లు దేశీయ, విదేశీ విధానాలపై ఉంటుందని, మారే రాజకీయ భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా వ్యాపారాలు స్పందిస్తాయని వివరించింది.

### వాణిజ్య



### ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్‌కు

## ఆర్బీఐ షాక్

***బంగారం రుణాలపై నిషేధం***

ముంబై, మార్చి 4: ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ బంగారం రుణాల మంజూరీ, పంపిణీపై రిజర్వ్‌బ్యాంక్ నిషేధం విధించింది. ఆ కంపెనీ గోల్డ్ లోన్ పోర్ట్‌ఫోలియో పర్యవేక్షణలో కొన్ని ఆందోళనలు తలెత్తడంతో తక్షణమే రుణ వితరణ నిలిపివేయాలంటూ ఆదేశించింది. అయితే ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ ప్రస్తుత గోల్డ్ లోన్ పోర్ట్‌ఫోలియో వసూళ్లు, రికవరీ ప్రక్రియలను నిర్వహించుకోవచ్చని సోమవారం ఆర్బీఐ విడుదల చేసిన ప్రకటన పేర్కొంది. బంగారం రుణాల మంజూరీ సమయంలోనూ, డిఫాల్ట్ అయిన సందర్భంలో వేలం వేసేటపుడు కంపెనీ సర్టిఫై చేసే బంగారం స్వచ్ఛత, నికర బరువు తదితర అంశాలపై తీవ్రమైన వ్యత్యాసాలు తమ తనిఖీలో వెల్లడయినట్టు ఆర్బీఐ తెలిపింది. ఇవి ఖాతాదారుల ప్రయోజనాలకు భంగకరమని, తాము నిర్వహించే ప్రత్యేక ఆడిట్ పూర్తయిన తర్వాత నియంత్రణల్ని సమీక్షిస్తామని వివరించింది.

# ఇక డిజిటల్ చెల్లింపులు ఇక సులభం

- **ఇంటర్నెట్ బ్యాంకింగ్‌కు ఇంటర్‌ఆపరబుల్ సిస్టమ్**
- **ఈ ఏడాదే తీసుకొస్తాం: దాస్**

న్యూఢిల్లీ, మార్చి 4: ఇంటర్నెట్ బ్యాంకింగ్ కోసం ఈ ఏడాదిలోనే ఇంటర్‌ఆపరబుల్ సిస్టమ్‌ను ప్రవేశపెడతామని రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్ వెల్లడించారు. సోమవారం ఒక సదస్సులో మాట్లాడుతూ ప్రస్తుతం ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా వ్యాపారులకు వినియోగదారులు జరిపే లావాదేవీలు పేమెంట్ అగ్రిగేటర్ల (పీఏ) ప్రాసెస్ అవుతున్నాయని, దీనికోసం బ్యాంక్ వివిధ ఆన్‌లైన్ మర్చెంట్స్ కోసం ప్రతీ పీఏతోనూ ఇంటిగ్రేట్ కావాల్సి వస్తున్నదని దాస్ తెలిపారు. అంటే ఖాతాదారుకు చెందిన బ్యాంక్, ఆయా పీఏతో ప్రత్యేక ఒప్పందం కుదుర్చుకోవడం అవసరమని, అది లేకపోతే చెల్లింపు వ్యాపారికి చేరదంటూ ప్రస్తుత సిస్టమ్‌లో ఉన్న కష్టనష్టాలను దాస్ వివరించారు. పలు పేమెంట్ అగ్రిగేటర్లతో ప్రతీ బ్యాంకూ ఇంటిగ్రేట్ కావడం కష్టమని, అందువల్ల వినియోగదారుల చెల్లింపులు వ్యాపారులకు అందడంలో జాప్యం జరుగుతుందని, సెటిల్‌మెంట్ రిస్కులు ఏర్పడతాయన్నారు.

## రూ.2.6 లక్షల కోట్లకు క్రెడిట్ కార్డ్ రుణాలు




న్యూఢిల్లీ, మార్చి 4: అన్‌సెక్యూర్డ్ రుణాలపై రిజర్వ్‌బ్యాంక్ రిస్క్ వెయిటేజీ పెంచినప్పటికీ, బ్యాంక్‌ల క్రెడిట్ కార్డ్ రుణాలు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతున్నాయి. 2024 జనవరి నెలలో బ్యాంక్‌లు క్రెడిట్ కార్డులపై ఇచ్చిన రుణాలు 31.3 శాతం పెరిగి రూ.2.6 లక్షల కోట్లకు చేరాయి. 2023 డిసెంబర్‌లో ఇవి రూ.2.5 లక్షల కోట్లు ఉన్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకూ క్రెడిట్ కార్డ్ ఎక్స్‌పోజరు 26.3 శాతం వృద్ధిచెందింది. అన్‌సెక్యూర్డ్ రిటైల్ రుణాలు బాగా పెరగడం వ్యవస్థాపర రిస్క్‌లకు దారితీస్తుందన్న ఆందోళనల్ని ఆర్బీఐ వ్యక్తం చేస్తూ బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు ఇచ్చే తనఖాలేని వినియోగ రుణాలపై గత ఏడాది నవంబర్‌లో రిస్క్ వెయిట్‌ను 25 బేసిస్ పాయింట్ల మేర పెంచింది. అంటే వాటిపై ఆర్థిక సంస్థలు అధిక కేటాయింపులు జరపాల్సి ఉంటుంది. దీంతో వ్యక్తిగత రుణాల వృద్ధి డిసెంబర్‌లో 26.6 శాతం ఉండగా, జనవరిలో 23.3 శాతానికి తగ్గింది. కానీ క్రెడిట్ కార్డు రుణాలు మాత్రం పెరుగుతూనే ఉన్నాయి.

## టీఎస్ ఐపాస్ మాదిరిగానే పారిశ్రామికం!

**బీఆర్‌ఎస్ హయాంలోని ప్రణాళికలు అమలుచేసే యోచనలో సర్కార్**

హైదరాబాద్, మార్చి 4(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నూతన ఇండస్ట్రియల్ పార్క్‌ల ఏర్పాటునకు సంబంధించి అధికార యంత్రాంగం సన్నాహాలు ప్రారంభించింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రకటించిన పాలసీలో కొన్ని మార్పులు చేసి విడుదల చేయడానికి రాష్ట్ర సర్కార్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తున్నది. అలాగే బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పరిశ్రమల కోసం ఎంపికచేసిన భూముల్లో మౌలిక సదుపాయాలు కల్పించి పరిశ్రమలకు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం తగిన చర్యలు తీసుకోవాలని టీఎస్‌ఐఐసీని ప్రభుత్వం ఆదేశించింది కూడా. టీఎస్ ఐపాస్ పేరుతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన విధానాన్నే కాస్త అటుఇటుగా కొత్త విధానాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 1.5 లక్షల ఎకరాల స్థలాన్ని పరిశ్రమల కోసం కేటాయించగా..దీంట్లో దాదాపు 28 వేల ఎకరాలను ఇప్పటికే పరిశ్రమలు ప్రారంభమయ్యాయి. అలాగే, కొత్తగా ఏర్పాటు చేయనున్న పారిశ్రామికవాడల్లో కూడా ఎంఎస్ఎంఈలకే ప్రాధాన్యత కల్పించాలని నిర్ణయించారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.